క్లుప్తంగా

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



లైబ్రేరియన్‌కు పుస్తకాలు ఇస్తున్న న్యాయవాది చంద్రశేఖర్

శృంగవరపుకోట: స్థానిక శాఖాగ్రంథాలయానికి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాది బొబ్బిలి చంద్రశేఖర్ రూ. 5000 విలువ చేసే పోటీ పరీక్షల పుస్తకాలను వితరణ చేశారు. లైబ్రేరియన్ డి.శ్రీధర్‌కు పుస్తకాలను మంగళవారం అందజేశారు. గ్రంథాలయ అభివృద్ధికి స్థానికుల సహాయ సహకారాలు తీసుకోనున్నట్లు లైబ్రేరియన్ చెప్పారు .

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆర్‌ఈసీఎస్ ఏడి బి.జగన్నాథం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గరివిడి పట్టణంతో పాటు కొండపాలెం, డి.ఎఫ్.ఎస్ ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బల్లల పండగ

శృంగవరపుకోట: పట్టణంలో ధారగంగమ్మ రజక సేవా సంఘం నేతృత్వంలో రజకులు మంగళవారం బల్లల పండగను ఘనంగా నిర్వహించారు. చాకలివీధి నుంచి డప్పులు, భాజాభజంత్రీలతో బయలుదే పట్టణంలో అన్ని వీధుల్లో ఊరేగారు. పులివేషాలు, కోలాటాల బృందాలతో రజకులు అంతా కుటుంబాలతో కలిసి పుణ్యగిరి రోడ్డులో ఉన్న చాకలిబంద వద్దకు వెళ్లి అమ్మవారికి పసుపు,కుంకుమ, చీరలు,రవికెలు, గాజులు,పూసలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తర్వాత చాకలి బందలోని బల్లలకు పూజలు చేశారు.

ప్రతీ గ్రామంలో చలివేంద్రం

మెరకముడిదాం: వేసవి నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ప్రతీ గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేయనున్నామని ఎంపీడీఓ పి.రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే గ్రామాల్లో ప్రధానమంత్రి జనఆరోగ్యయోజన పథకం కార్డులకు సంబంధించి ఈకేవైసీ చేయిస్తున్నామని పేర్కొన్నారు. ఈపథకం ద్వారా అన్ని ఆస్పత్రుల్లో రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చని వివరించారు. మండలానికి సంబంధించి 18 వేల మంది వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 13 వేల మంది వివరాలను నమోదు చేశామని, మిగిలినవి త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు.

అంతర్జాతీయ టైలర్ల దినోత్సవం



విలియమ్స్ హోవే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టైలర్లు

గంట్యాడ: అంతర్జాతీయ టైలర్ల దినోత్సవాన్ని స్థానిక కొఠారుబిల్లి జంక్షన్‌లో కనకదుర్గ ప్రైమరీ టైలర్ల కో–ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో సొసైటీ అధ్యక్షుడు బురద మహేశ్వరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కుట్టు మిషన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త విలియమ్స్ హోవే చిత్రపటానికి సొసైటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహేశ్వరావు మాట్లాడుతూ టైలర్లకు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న తోడు కార్యక్రమం ద్వారా ఆర్థిక సాయం చేస్తోందని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ సాయం టైలర్ల ఆర్థిక ప్రగతికి ఊతమిస్తోందని చెప్పారు. సొసైటీ ప్రతినిధి పాటుపురెడ్డి అప్పలసత్యం పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

లక్కవరపుకోట: మండల కేంద్రంలో భారీ ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్ఠించి 5 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ఉదయం నుంచే భక్తులు దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి విగ్రహం వద్ద మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అలాగే పూడివానిపాలెంలో అభయాంజనేయ స్వామి తీర్థం ఘనంగా నిర్వహించారు.

చెరకు సాగుపై దృష్టిసారించాలి

దత్తిరాజేరు: తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే చెరకు పంట సాగుపై రైతులు దృష్టి సారించాలని అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త రామారావు సూచించారు. చౌదంతివలసలో ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు నివాసం వద్ద కె.కొత్తవలస, కె.కృష్ణాపురం, చౌదంతివలస గ్రామాల రైతులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. చెరకు పంట సాగు గణనీయంగా తగ్గిపోయిందని, పంట విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను నేరుగా రైతులను కలిసి వారికి వివరిస్తున్నామని ఆయన చెప్పారు. విత్తనం నుంచి కొనుగోలు వరకు ప్రభుత్వమే బాధ్యత వహించనుందని తెలిపారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో 180 ఎకరాల్లో చెరకు సాగు చేస్తున్న రైతులు రెట్టింపు స్థాయిలో పంటను వేసేందుకు అధికారుల ముందు తమ అంగీకారం తెలిపారు. విజయనగరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణారావు, ఏఈఓ నీలాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల దర్శనానికి పోటెత్తిన భక్తులు

- ముగిసిన చీపురుపల్లి కనకమహాలక్ష్మి, జామి యల్లారమ్మ జాతర్లు





పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి అమ్మవారు, జామి యల్లారమ్మ తల్లి



చీపురుపల్లి: కనకమహాలక్ష్మి ఆలయం వద్ద భక్తుల సందడి

చీపురుపల్లి: పట్టణంలో మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించిన కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మంగళవారంతో ముగిసింది. జాతర ఆఖరి రోజు మంగళవారం తెల్లవారు ఝామున 5 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూకట్టారు. ఉదయం ప్రారంభమైన దర్శనాలు మధ్యాహ్నం ఒంటి గంటవరకు కొనసాగాయి. మళ్లీ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి దేవదాయ ధర్మాదాయశాఖ ఘన స్వాగతం పలికింది. దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, బెల్లాన వంశీకృష్ణ, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

అనుబంధ అమ్మవార్లకు పూజలు

కనకమహాలక్ష్మి జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి అక్క, చెల్లెల్లుగా చెప్పుకునే చీపురుపల్లిలోని కోటదుర్గమ్మ, అసిరితల్లి, సంతానలక్ష్మి, భాగిరేతమ్మ ఆలయాల్లో పట్టణానికి చెందిన భక్తులు మంగళవారం పూజలు చేశారు. జాతర ఆఖరిరోజున అనుబంధ అమ్మవార్లకు పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయి తీగా వస్తోంది.ఆలయాల వద్ద భక్తుల కోసం కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. కోటదుర్గమ్మ ఆల యం వద్ద భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కోటదుర్గమ్మ అమ్మవారిని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ, అర్చ కులు జెడ్పీ చైర్మన్‌కు పూర్ణ కుంభంతో స్వాగతం పలి కారు. కోటదుర్గమ్మ ఆలయానికి దూపదీప నైవేథ్యం పథకం వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్‌ను ఆలయ కమిటీ విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మంగళగిరి శ్రీను, కమిటీ సభ్యులు రాజు, శేఖర్, సువ్వాడ అప్పలనాయుడు, చిన్ని పాల్గొన్నారు.

జామిలో..

జామి: మండలకేంద్రంలో మూడురోజులుగా నిర్వహించిన యల్లారమ్మ జాతర మంగళవారంతో ముగిసింది. జాతర ఆఖరిరోజు కావడంతో వేలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని, సహకరించిన పోలీసు, రెవెన్యూ, దేవదాయ, పంచాయతీ, వైద్య, తదితర శాఖల అధికారులు, భక్తులకు సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఉపసర్పంచ్ అల్లు పద్మ తదితర పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

భీమసింగి, అలమండలో...

భీమసింగి, అలమండ గ్రామాల్లో యల్లారమ్మ తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏటా జామి యల్లారమ్మ జాతర ఆఖరి రోజున భీమసింగిలో యల్లారమ్మ తీర్థం నిర్వహిస్తారు. ఆయా గ్రామాలతో పాటు చిల్లపాలెం,యాతపాలెం, సోమయాజులపాలెం తదితర గ్రామాల భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, రవికలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



చీపురుపల్లి: పూజలందుకుంటున్న కోటదుర్గమ్మ తల్లి



చీపురుపల్లి: దివ్యాంగులను కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వీల్‌చైర్‌లో తీసుకెళుతున్న ఆశయ రమణ



చీపురుపల్లి: కోటదుర్గమ్మను దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



చీపురుపల్లి: కనకమహాలక్ష్మి ఆలయం వద్ద భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలు



జామి: భీమసింగిలో పూజలందుకుంటున్న యల్లారమ్మ తల్లి



చీపురుపల్లి: కనకమహాలక్ష్మి ఆలయం వద్ద బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు దంపతులకు స్వాగతం పలుకుతున్న స్థానిక నాయకులు



జామి: యల్లారమ్మ తల్లి దర్శనానికి బారులు తీరిన భక్తులు



గుర్ల: పల్లిగండ్రేడులో యల్లమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

పల్లిగండ్రేడులో..

గుర్ల: మండలంలోని పల్లిగండ్రేడులో యల్లమ్మ తల్లి జాతర నేపథ్యంలో మంగళవారం సాయంత్రం సిరిమానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే గుర్ల, గుజ్జింగివలస, గూడెం, పాలవలస, గరికివలస, ఆనందపురం, కొండగండ్రేడు, తెట్టంగి తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ శిరీష బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి

- సీఎం జగన్‌తోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యేలు అప్పలనరసయ్య, శ్రీనివాసరావు

గజపతినగరం రూరల్/ కొత్తవలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటు చేసి గెలిపించాలని గజపతినగరం, ఎస్.కోట ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, కడుబండి శ్రీనివాసరావు కోరారు. గజపతినగరం మండలంలోని జిన్నాం, లింగాలవలస, రామన్నపేట, ముచ్చెర్ల, కెంగువ తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య, కొత్తవలస మండలంలోని రాజుపాత్రునిపాలెం,కొత్తవలస-1 సచివాలయాల పరిధిలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఓటు వేసి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర అభివృద్ధికి చేస్తున్న కృషిని పట్టభద్రులకు ఎమ్మెల్యేలు వివరించారు. జగనన్న విద్యాదీవెన, వసతీ దీవెన, విదేశీవిద్య, లా నేస్తం, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాల ద్వారా ఎంతోమంది పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోగలుగుతున్నారని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం జగన్ సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తూ పాలనసాగిస్తున్నారని చెప్పారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో గృహసారథులతో ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. పార్టీ విజయానికి అంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు. గృహసారథులు తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించాలని కోరారు. గజపతినగరం జెడ్పీటీసీ గారతవుడు, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు బూడి వెంకటరావు, నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కనకల సుబ్రహ్మణ్యం,మూర్తి, కొత్తవలస ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, వైస్ ఎంపీపీలు కర్రి శ్రీను, మేలాస్త్రి సరస్వతి, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు,రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ లెంక లక్ష్మి, గనిశెట్టిపాలెం, దెందేరు సర్పంచ్‌లు జామి ఈశ్వరరావు, విరోతి వెంకటరమణ,నాయకులు బొంతల వెంకటరావు, పి.ఎస్.ఎన్.పాత్రుడు, రామన్నపాత్రుడు పాల్గొన్నారు.



లింగాలవలసలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య



రాజుపాత్రునిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

విద్యార్థిని అదృశ్యం

గజపతినగరం: మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థిని టాలెంట్ టెస్ట్ రాసేందుకు గత నెల 26వ తేదిన గజపతినగరం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని విద్యార్థిని తల్లి స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ ఎస్.అంజిబాబు మాట్లాడుతూ విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

చీడివలసలో పొలంబడి

కొత్తవలస: మండలంలోని చీడివలస గ్రామంలో సబల సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ద్రవజీవా మృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. నువ్వు పంటకు ద్రవ జీవామృతం అందించడం వల్ల ఎండ తీవ్రతకు తట్టు కుంటుందన్నారు. నవ ధాన్యాల సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. సబల సంస్థ ప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించండి

వేపాడ: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని, వాటి సాగును ప్రోత్సహించేలా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజియన్ టెక్నికల్ అధికారి హేమసుందర్ సూచించారు. బొద్దాం సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజియన్ కో-ఆర్డినేటర్ పి.వెంకటరావు నేతృత్వంలో ఏపీసీఎన్ఎఫ్‌సీఎస్‌ఏ సిబ్బందికి బొద్దాంలో మంగళవారం అవగాహన కల్పించారు. హేమసుందర్ మాట్లాడుతూ ఖరీఫ్ వరి నాట్లు వేసే ముందు ఎకరానికి 30 రకాల నవధాన్యాల విత్తనాలను 13 కిలోలు చొప్పున జల్లాలని సూచించారు. చేను పెరిగిన 45 రోజుల తర్వాత కలియదున్నడం వల్ల నేల గుల్లబారుతుందని, పోషకాలు పెరుగుతాయని చెప్పారు. విత్తన శుద్ధి చేయు విధానం వివరించారు.

ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులాహ్వానం

లక్కవరపుకోట: జమ్మాదేవిపేట గ్రామ సమీపంలోని మహాత్మా జ్యోతీరావుపూలే బాలికల ఆశ్రమ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్‌పాత్రో మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022-23వ సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుకున్న విద్యార్థినులు ఈ నెల 5 నుంచి ఏప్రిల్ 4వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 9 నుంచి 11 ఏళ్ల మధ్య ఉన్న బీసీ బాలికలు, 9 నుంచి 13 ఏళ్ల మధ్య వయసు ఉన్న ఎస్సీ,ఎస్టీ బాలికలు అర్హులని వివరించారు. ప్రవేశ పరీక్ష నిర్వహించి, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

సచివాలయాల్లో పూర్తిస్థాయిలో ఆధార్ సేవలు



బొండపల్లి: సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వేదవతి

బొండపల్లి: గ్రామసచివాలయాల్లో పూర్తిస్థాయిలో ఆధార్ సేవలు అందించేలా సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ ఏ.వేదవతి కోరారు. మండల కేంద్రంలోని సచివాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. సచివాలయ, సిబ్బందితో ఆధార్ సేవలపై సమీక్షించారు. మండలంలో మూడు సచివాలయాల్లో ప్రయోగా త్మకంగా ఆధార్ కేంద్రాలను ప్రారంభించామని, ఇక్కడ పూర్తిస్థాయిలో ఆధార్ సేవలు అందితే అన్ని సచివాలయాల్లోనూ ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసు కుంటామని చెప్పారు. ప్రజలు తమ సమస్యలపై అందించే అర్జీలకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని సిబ్బందికి సూచించారు.సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం సందర్శన

దత్తిరాజేరు: స్థానిక గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మంగళవారం పరిశీలించారు. ఆధార్ సేవల వివరాలపై డిజిటల్ అసిస్టెంట్‌ను ఆరా తీశారు. కేంద్రానికి వచ్చే వారిని ఆధార్ సేవలకు సంబంధించిన దరఖాస్తుల కోసం దూరంగా ఉన్న జెరాక్స్ దుకాణాలకు పంపిస్తున్న వస్తున్న విషయం ఆయన దృష్టికి రావడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నుంచి సచివాలయంలో స్టేషనరీ అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

నేడు జీడిపంట సస్యరక్షణపై అవగాహన

కొత్తవలస: జీడిపంట సాగులో సస్యరక్షణ,యాజమాన్యపద్ధతులపై మండలంలోని సంతపాలెం గ్రామ రైతు భరోసాకేంద్రంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు హెచ్ఓ ఉమాభరణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీడి పంట సాగులో పాటించాల్సిన మెలకువలను గుంటూరు జీడి రీసెర్చ్ కేంద్రం శాస్త్రవేత్తలు వివరిస్తారని, మండల జీడి రైతులు అంతా ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

పాఠశాల సందర్శన

వేపాడ: స్థానిక ప్రాథమిక పాఠశాలను వేపాడ స్కూల్ కాంప్లెక్సు చైర్‌పర్సన్ ఎస్.ఎస్.వల్లీ, సీఆర్పీ లక్ష్మి మంగళవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల వర్క్ బుక్స్, టీచర్ లెసెన్ ప్లాన్స్ పరిశీలించారు. విద్యార్థులు విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. మధ్యాహ్న భోజనాలను మెనూ ప్రకారం విద్యార్థులకు అందించేలా పర్యవేక్షణ చేయాలని హెచ్ఎం తులసికి సూచించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వర రెడ్డి

గంట్యాడ: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఈఓ లింగేశ్వరరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని నరవ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ఆయన తనిఖీలు చేశారు. ముందుగా మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. బైజూస్ కంటెంట్‌తో ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను 8వ తరగతి విద్యార్థులు వినియోగిస్తున్నారా లేదా, ఎంతవరకు ట్యాబ్‌ల ద్వారా పాఠాలు నేర్చుకున్నారని పరీక్షించారు. పాఠశాలను ఆహ్లాదకరంగా ఉంచాలని హెచ్ఎం ద్వారకబాయికి సూచించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, గురుకులాలు, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ 1928 ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నందుకు గుర్తుగా ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించుకుంటున్నట్లు ఉపాధ్యా యులు, అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. సి.వి.రామన్ చిత్రపటాలకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు తాము తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించి, వాటి పనితీరును ఉపాధ్యాయులు, వీక్షకులకు వివరించారు. ఉత్తమ ప్రాజెక్టులను తయారు చేసిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

- సాక్షి నెట్‌వర్క్



కొత్తవలస: కొత్తవలస గాయత్రీ స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



వేపాడ: వేపాడ హైస్కూల్‌లో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న హెచ్ఎం వల్లీ



కొత్తవలస: కంటకాపల్లి హైస్కూల్‌లో సి.వి.రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



వేపాడ: సోంపురం హైస్కూల్‌లో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న హెచ్ఎం బాలభాస్కర్, ఉపాధ్యాయులు



శృంగవరపుకోట: నారాయణ పాఠశాలలో ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



జామి: జామి ఉన్నత పాఠశాలలో సి.వి.రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



గజపతినగరం: బాలుర హైస్కూల్‌లో విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న హెచ్ఎం గౌరినాయుడు



కొత్తవలస: ఓపీ జిందాల్ భారత్ పాఠశాలలో ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



శృంగవరపుకోట: ధర్మవరం ఉన్నత పాఠశాలలో ప్రాజెక్టు పనితీరును వివరిస్తున్న విద్యార్థులు



గుర్ల: సి.వి.రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తెట్టంగి హైస్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది



మెరకముడిదాం: గర్భాం మోడల్‌స్కూల్‌లో ప్రాజెక్ట్‌లను పదర్శిస్తున్న విద్యార్థినులు



జామి : జామి హైస్కూల్‌లో ప్రాజెక్టులను తిలకిస్తున్న ఉపాధ్యాయుడు



గజపతినగరం: బాలురు హైస్కూల్‌లో సి.వి.రామన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు